క్లుప్తంగా

వారపు సంతలో పనస పండ్లకు గిరాకీ



మాడుగుల వారపు సంతకు వచ్చిన పనస పండ్లు

మాడుగుల : మాడుగుల పట్టణంలో సోమవారం జరిగిన వారపు సంతలో పనస పండ్లకు గిరాకీ పెరిగింది. గతవారం ఒక్కో పనస పండు రూ. 50 నుంచి రూ. 100 వరకు ధరలు పలికాయి. ఈ వారంలో మరింత ధరలు పలికాయి. దూర ప్రాంతాల నుంచి బడా వ్యాపారులు రావడం వల్ల ధరలు పెరిగాయని, దీంతో తమకు కూలి గిట్టుబాటు అయిందని, దేవాపురం, కక్కి, సలుగు, వంట్ల మామిడి నుంచి వచ్చిన గిరి రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పీఏసీఎస్‌ను లాభాల బాటలో నడిపించేలా కృషి



పీఏసీఎస్ అధ్యక్షుడు రామారావు, ఎమ్మెల్యే బండారును సత్కరిస్తున్న నాయకులు

కె.కోటపాడు : కె.కోటపాడు పీఏసీఎస్‌ను లాభాల బాటలో పయనించేలా రైతుల సహకారంతో కృషి చేయనున్నట్టు సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన చీపురపల్లి రామారావు అన్నారు. సకాలంలో వ్యవసాయ రుణాలతో పాటు విత్తనాలు, ఎరువులు అందిస్తామని అన్నారు. సోమవారం పీఏసీఎస్ అధ్యక్షునిగా రామారావు ప్రమాణస్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరయ్యారు. అనంతరం రామారావుతో పాటు ఎమ్మెల్యే బండారును పలు గ్రామాల టీడీపీ నాయకులు సత్కరించారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టును వినియోగించుకోండి

చీడికాడ : ప్రతి ఒక్కరు ప్రకృతి అందించిన బలమైన సేంద్రియ ఎరువైన వర్మీ కంపోస్టును వినియోగించుకోవాలని ఎంపీడీవో హేమసుందరరావు అన్నారు. సోమవారం మండలంలోని జి.కొత్తపల్లి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు అమ్మకం స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ మేరకు ఆ యూనిట్ పరిసరాల్లో వర్మీ కంపోస్టు వినియోగించి పండించిన కూరగాయల అమ్మకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్మీ కంపోస్టుతో ఎంతో మేలు జరుగుతుందని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ చంద్రశేఖరరావు ఉన్నారు.

ఇంటర్ ఫస్టియర్‌లో చేరికకు 11 తేదీ వరకు గడువు

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరికకు ఈ నెల 11 వరకు గడువును ప్రభుత్వం పెంచిందని స్థానిక ప్రిన్సిపాల్ బి.రాధ తెలిపారు. ఈ మేరకు స్థానిక కళాశాలలో అన్ని గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు స్థానిక కళాశాలను సంప్రదించి అడ్మిషన్ పొంది చేరవచ్చునని ప్రిన్సిపాల్ రాధ సూచించారు.

పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు అందించండి



వడ్డాదిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బుచ్చెయ్యపేట : పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు అందించాలని ఐసీడీఎస్ పీఓ మంగతాయారు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆమె మేజర్ పంచాయతీ వడ్డాదిలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాలలో పోషకాలపై అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు అందించడం వల్ల బిడ్డ,తల్లి ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. ఏఏ పదార్థాల్లో ఏఏ పోషకాలుంటాయో వివరించారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ ప్రతిష్ట

బుచ్చెయ్యపేట : మండలంలో గల కొండెంపూడి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా కలిసి గ్రామ శివారులో లక్షలాది రూపాయలతో గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయం నిర్మించారు.

ఇసుక తవ్వకాలతో వంతెనలకు ముప్పు

- చమ్మచింత వద్ద అక్విడెక్టు కూలితే నిలిచిపోనున్న తాండవ కుడి కాలువ నీరు
- రెండు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం
- కూటమి నేతలకు కాసులు కురిపిస్తున్న ఇసుక అక్రమ రవాణా



ఎడ్ల బండిపై నదిలోంచి తెచ్చి ఒడ్డున నిల్వ చేసిన ఇసుక



చమ్మచింత వద్ద నదిలో ఇసుక తవ్వకాలతో బయటకు కన్పిస్తున్న వంతెన పునాది సిమెంటు దిమ్మ

నాతవరం : తాండవ నదిలో నిబంధనలు పాటించకుండా అక్రమ ఇసుక తవ్వకాలు చేయడంతో వంతెనలకు ప్రమాదం పొంచి ఉంది. మండలంలో తాండవ నదిపై చమ్మచింత, గుమ్మడిగొండ, చిక్కుడుపాలెం గ్రామాల వద్ద వంతెనలు ఉన్నాయి. తాండవ రిజర్వాయరు నుంచి నీటిని ఆయకట్టు భూములకు సరఫరా చేసేందుకు పలు చోట్ల నదిపై కాలువలకు వంతెనలు నిర్మించారు. తాండవ నదిలో నీరు చమ్మచింత, పొట్టినాగన్నదొరపాలెం, తాండవ, కె.వి.శరభవరం, గుమ్మడిగొండ, కొవడటిపూడి అగ్రహారం, చిక్కుడుపాలెం, రాజుపేట అగ్రహారం మీదుగా కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలోకి ప్రవహిస్తుంది. నాతవరం మండలంలో చిక్కుడుపాలెం, గుమ్మడిగొండ, చమ్మచింత గ్రామాల వద్ద రాకపోకలు సాగించేందుకు తాండవ నదిలో సుమారుగా రూ.12 కోట్ల వ్యయంతో మూడు చోట్ల వంతెనలు నిర్మించారు. తర్వాత చమ్మచింత వద్ద తాండవ రిజర్వాయరు నుంచి కుడికాలువ ద్వారా నాతవరం మండలంతో పాటు కాకినాడ జిల్లా కోటనందూరు, రౌతులపూడి మండలాల్లో ఉన్న ఆయకట్టు భూములకు నీరు ప్రవహించేందుకు నదిలో వంతెన నిర్మించారు. వంతెనల వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా తాండవ నదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. చమ్మచింత వద్ద నదిలో నిర్మించిన వంతెనకు సిమెంటు స్తంభాలు చుట్టూ లోతుగా ఇసుక తవ్వేయడంతో రాళ్లు తేలి ఐరన్ ఊచలు బయటకు కన్పిస్తున్నాయి. ఇక్కడ నదిలో నిర్మించిన వంతెన కూలిపోతే ఖరీఫ్ పంటకు రెండు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే కుడి కాలువ నీటి ప్రవాహం నిలిచిపోయే ప్రమాదం ఉంది. చమ్మచింత ప్రాంతంలో నదిలో ఇసుక లోతుగా తవ్వేయడంతో నది ఒడ్డున ఉన్న రైతుల భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉండడంతో ఈ ప్రాంత రైతులు ఇటీవల తవ్వకాలు అడ్డుకున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా కూటమి ప్రభుత్వ పెద్దలకు భయపడి అధికారులు అటువైపు కనీసం కన్నెత్తి చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చమ్మచింత గ్రామానికి చెందిన కొందరు రైతులు ధైర్యం చేసి నదిలో ఇసుక తవ్వకాలు అడ్డుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన సిమెంటు స్తంభాల చుట్టూ పాక్లెయిన్‌తో రాళ్లు, మట్టి ఏర్పాటు చేశారు. నదిలో పశువులు నీళ్లు తాగడానికి వెళ్లే దారుల్లో ఇసుక తవ్వకాలతో ప్రమాదకరంగా తయారైన గోతులను కప్పుతున్నారు.

తవ్వకాలకు అనుమతి లేదు...

తాండవ నదిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. అయినా నిబంధనలు బేఖాతరు చేసి నదిలో రోజుకు 50 ట్రాక్టర్లకు పైగా రాత్రి పగలనే తేడా లేకుండా ఇసుక తవ్వకాలు జరిపి తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు రోజుకు 5 నుంచి 6 ట్రిప్పులు తిరుగుతుంది, నదిలో ఇసుక తవ్వి ఎడ్లబండిపై ఒడ్డుకు తెచ్చి ట్రాక్టర్లపై లోడు చేస్తున్నారు. మండలంతో పాటు నర్సీపట్నం మున్సిపాలిటీకి ఇతర ప్రాంతాలకు పట్టపగలే దర్జాగా ఇసుక రవాణా చేస్తున్నారు. వాస్తవంగా ఉచిత ఇసుక తరలిచేటప్పుడు విధిగా ట్రాక్టరుకు బ్యానర్ ఉండాలి. ఇసుక రవాణా చేసే ఏ వాహనానికి ఉచిత ఇసుక బ్యానరు కన్పించదు. కూటమి నేతలకు భయపడి అన్ని శాఖలు అధికారులు కళ్ల ముందే ఇసుక రవాణా చేస్తున్నా తమ కేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

వంతెనలు కాపాడండి

తాండవ నదిలో ఇసుక తవ్వకాలు ఇలాగే కొనసాగిస్తే వంతెనలు కూలిపోతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాండవనదిపై వంతెనల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి ఆందోళనలు చేశాం. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి భద్రాచలం పార్లమెంటు సభ్యుడి హోదాలో సీపీఎం నేత మిడియం బాబురావు, సీపీఐ నేతలు జె.వి.సత్యనారాయణ, బాలేపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో వంతెనల కోసం ఆందోళనలు చేసిన సంఘటనలు గుర్తు చేశారు. చమ్మచింత వద్ద ఆక్విడెక్టు సిమెంటు స్తంభాలు కూలిపోతే రెండు జిల్లాలకు ప్రవహించే తాండవ కుడి కాలువ నీరు నిలిచిపోతుంది. రైతులకు ఊహించని నష్టం జరిగే ప్రమాదం ఉంది. -అంకంరెడ్డి చిన్నయ్యనాయుడు, సీపీఐ కార్యదర్శి

గ్రామాల్లో కొనసాగుతున్న వైద్య శిబిరాలు



అమ్మపేట గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



గాదంపాలెంలో స్ప్రేయింగ్ పనులు

గొలుగొండ : అమ్మపేట గ్రామంలో సోమవారం గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి మందులు అందజేశారు. చికున్‌గున్యా, మలేరియా, డెంగ్యూ లక్షణాలు కలిగి ఉన్న వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. అమ్మపేట, గాదంపాలెం, విప్పలపాలెం గ్రామాల్లో జ్వరాల తీవ్రతపై పంచాయతీ పాలకులు, వైద్య సిబ్బంది అప్రమత్తం అయ్యారు. గాదంపాలెం గ్రామంలో పంచాయతీ పాలకులు స్ప్రేయింగ్ పనులు ముమ్మరం చేశారు. కాలువల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. తాగునీటి పథకాల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు.

సెల్‌ఫోన్లు అప్పగించిన అంగన్‌వాడీలు



రావికమతం సీడీపీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

రావికమతం : రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రావికమతం, రోలుగుంట, చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సేవలకు వినియోగిస్తున్న సెల్‌ఫోన్‌లను సోమవారం సీడీపీవో కార్యాలయానికి తిరిగి అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో సేవల్లో ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని సీడీపీవో కార్యాలయం వద్ద ఆందోళన చేసి వినతిపత్రం కార్యాలయం సిబ్బందికి అందజేశారు. 2022లో 2జీ నెట్‌వర్క్‌తో ఇచ్చిన సెల్‌ఫోన్లలో 90 శాతం పని చేయడం లేదు. యాప్‌ల నిర్వహణకు కావలసిన నెట్ స్పీడ్ ఇవ్వలేదు. మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సెల్ సిగ్నల్స్ ఉండట్లేదు..అందువల్ల వాటిని తిరిగి సీడీపీవో కార్యాలయానికి అప్పగించినట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు నాయకులు సత్యవేణి, వరలక్ష్మి తెలిపారు.

స్పీకర్‌కు దళితుల సమస్యలు పట్టవా..

- మోకాళ్లపై క్వారీ బాధిత రైతుల నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న క్వారీ బాధిత రైతులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీ రద్దు చేయాలని బాధిత దళిత రైతులు చేపట్టిన నిరాహారదీక్షలు సోమవారం నాటికి 13వ రోజుకు చేరింది. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద మోకాళ్ల నిల్చొని నిరసన తెలిపారు. ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు మాట్లాడుతూ అధికారులకు దళితుల భూములన్న, దళితుల ప్రాణాలన్నా లెక్క లేదన్నారు. మైనింగ్ మాఫియాను కాపడడం కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. 13 రోజులుగా బాధితులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా స్పీకర్ అయ్యన్నపాత్రుడు కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇదే దారిన రాకపోకలు సాగిస్తున్న స్పీకర్ దీక్ష శిబిరం వద్దకు వచ్చి దళితుల గోడు వినలేదన్నారు. దళితుల ఓట్లు కావాలి కానీ వారి సమస్యలు స్పీకర్‌కు అవసరం లేదన్నారు. ఇప్పటికైనా స్పీకర్ స్పందించి క్వారీ అనుమతులు రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చిరంజీవి, బాధిత దళిత రైతులు అప్పారావు, లోవరాజు, కళ్యాణం, పెంటయ్య, మారేసు, నాగభూషణం పాల్గొన్నారు.

ఓవర్‌లోడు వాహనాల నియంత్రణకు చర్యలు



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆర్డీవో వి.వి.రమణ

నర్సీపట్నం : ఓవర్ లోడు వాహనాలను నిరోధించేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్డీవో వి.వి.రమణ సూచించారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో ఆర్డీవో పోలీసు, రవాణా, రెవెన్యూ, అర్‌అండ్‌బీ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఓవర్‌లోడు వాహనాల వల్ల కశింకోట, మాకవరపాలెం మండలం వరకు 34 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరించి ఉందని, 14 కిలోమీటర్ల వరకు రోడ్డు దెబ్బతిన్నట్టు అర్‌అండ్‌బీ అధికారులు గుర్తించారని ఆర్డీవో తెలిపారు. ఓవర్‌లోడు వాహనాలను అరికట్టేందుకు శెట్టిపాలెం వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశామని, మరో చెక్‌పోస్టు కన్నూరు పాలెం వద్ద ఏర్పాటు చేసేందుకు చర్చించడం జరిగిందన్నారు. దెబ్బతిన్న వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలా, మరమ్మతులు చేయాలా అనే విషయమై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అర్‌అండ్‌బీ అధికారులకు సూచించడం జరిగిందన్నారు. 14 కిలోమీటర్లు దెబ్బతిన్న రోడ్డు నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్‌ఐలు, రవాణాశాఖ , అర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ జోన్ సోషల్ మీట్



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరావు

మాడుగుల రూరల్ : వాసవీ క్లబ్ జోన్ సోషల్ మీట్ మాడుగులలో సోమవారం నిర్వహించారు. జోన్ చైర్‌పర్సన్ పుట్టా మాధవి స్వగృహంలో జరిగిన ఈ సమావేశంలో క్లబ్ జిల్లా అధికారి వై. రమేశ్వరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో వాసవీ క్లబ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. జోన్ చైర్‌పర్సన్ మాధవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వనిత క్లబ్ అధ్యక్షురాలు పి.రాధిక అధ్యక్షత వహించారు. మాడుగుల వాసవీక్లబ్ అధ్యక్షుడు కొట్యాడ రమేష్, కింతలి గాదిరాయి సంఘ అధ్యక్షుడు గున్నయ్యశెట్టి, ఎం.కోడూరు సంఘ అధ్యక్షుడు మేడిశెట్టి రమణబాబు, పాడేరు హిల్స్ వనిత మోదమాంబ అధ్యక్షురాలు శ్రీనాథు మణి గడిచిన ఆరు మాసాల్లో ఆయా సంఘాల్లో చేపట్టిన కార్యక్రమాలు వివరించారు.

మండల సమస్యలపై బీజేపీ నేతల వినతి



తహసీల్దార్ రమాదేవిని కలసిన బీజేపీ నాయకులు స్వామి, వరలక్ష్మి ప్రసాదరావు

మాడుగుల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎస్ మాధవ్ ఆదేశాల మేరకు మాడుగులకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు సోమవారం ఉదయం మండల స్థాయి అధికారులను కలసి గ్రామ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ రమాదేవి, పంచాయతీ సర్పంచ్ కళావతి, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, ఎస్.నారాయణరావులను మర్యాద పూర్వకంగా కలిసి మాడుగుల పట్టణంలో ఉన్న సమస్యలను వివరించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వడ్డాది వరలక్ష్మి, శ్రీనాదు ప్రసాదరావు, మండల వాసు, మండల అధ్యక్షుడు మెలిపాక స్వామి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మండల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెదమదీన భూ ఆక్రమణలపై ఫిర్యాదు



పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌కు ఫిర్యాదు కాపీని అందిస్తున్న పెదమదీన గ్రామస్తులు

బుచ్చెయ్యపేట : పెదమదీన గ్రామంలో సర్వే నెంబర్ 81లో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పెదమదీన గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 85 ఎకరాల ప్రభుత్వ భూమిని అనకాపల్లి ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు సరుగుడు తోటలు వేసి ఆక్రమిస్తున్నారన్నారు. ఆ భూమిని మా గ్రామ అభివృద్ధికి కేటాయించాలని మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, లాయర్ చొప్పా బాబూరావు నాయకులు వియ్యపు నాయుడు, యన్నెంశెట్టి ఈశ్వరరావు,కొంత్యాన గోవింద,దాసరి పరదేశినాయుడు తదితరులు కలెక్టర్ విజయక్రిష్ణన్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ అందించిన ఫిర్యాదు కాపీని జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌కు అందించి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవకుండా చూడాలని కోరారు.

'స్మార్ట్ మీటర్లతో మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదు'



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీలు

నర్సీపట్నం : అదానీ కంపెనీతో స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ వామపక్ష పార్టీలు ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించాయి. ప్రజలపై విద్యుత్ భారం మోపవద్దని నినాదాలు చేశారు. కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ రెగ్యులేటర్ కమిటీ అథారిటీ అనుమతితో రూ.12 వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత చిన్న నివాస గృహాలు, చిన్న వ్యాపారులకు కూడా రూ.వేలల్లో బిల్లులు వస్తాయన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, చిన్న పరిశ్రమలకు, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు సబ్సిడీ విద్యుత్తు సౌకర్యం ఉండదన్నారు. స్మార్ట్ మీటర్లతో ప్రతి గంటకి రీడింగ్ తీసి, బిల్లు వేస్తారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోకపోతే కూటమి ప్రభుత్వం మరో బషీర్‌భాగ్ విద్యుత్ ఉద్యమాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, చిరంజీవి, ఎల్.గౌరీ, కె.వి.సూర్యప్రభ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.గురుబాబు, ఫణేంద్ర, మర్రిబాబు, గంగాభవానీ, కె.లక్ష్మి, రెడ్డి చిన్ని పాల్గొన్నారు.

వెంకన్నపాలెం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టు వద్ద సీఐ, ఎస్‌ఐలకు సూచనలిస్తున్న ఆర్డీవో రమణ

మాకవరపాలెం : పరిమితికి మించి లోడుతో నడుస్తున్న లారీలపై చర్యలు తీసుకునేందుకు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. మండలంలోని రాచపల్లి వద్ద ఉన్న ఆన్‌రాక్ (పయనీర్) అల్యూమినియం రిఫైనరీకి నిత్యం విశాఖ, తాళ్లపాలెం ప్రాంతాల నుంచి ముడిసరుకు లారీలపై వస్తుంది. అయితే ఈ లారీలు పరిమితికి మించి తిరగడం వల్ల కశింకోట మండలం అచ్చెర్ల జంక్షన్ సమీపంలో గెడ్డపై ఉన్న వంతెనకు ముప్పు ఉందని గత నెల 29న స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెంకన్నపాలెం వద్ద లారీలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఏడు లారీలను పోలీసులకు అప్పగించగా వీటికి మోటార్ వెహికల్ అధికారులు రూ.3.92 లక్షలు జరిమానా విధించారు. ఈ నేపథ్యంలో సోమవారం శెట్టిపాలెం శివారు వెంకన్నపాలెం వద్ద తాత్కాలిక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టును నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ పరిశీలించారు. అనంతరం రూరల్ సీఐ రేవతమ్మ, స్థానిక ఎస్‌ఐ దామోదర్‌నాయుడుతో ఆర్డీవో మాట్లాడారు. ప్రతి లారీని తనిఖీలు చేయాలని, పరిమితికి మించి నడుస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

డ్వాక్రా సొమ్ము స్వాహాపై మహిళల ఫిర్యాదు



వినతులు స్వీకరిస్తున్న ఏవో సుధాకర్, తహసీల్దార్ రామారావు

నర్సీపట్నం : మెప్మా సిబ్బంది నెల నెలా బ్యాంక్‌లకు చెల్లించే అప్పు వాయిదాలను సక్రమంగా చెల్లించకుండా స్వాహాకు పాల్పడ్డారని 27 డ్వాక్రా గ్రూపుల సభ్యులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. మా సంఘాలకు ఆర్పీ నూకరత్నం సొమ్ము దుర్వినియోగానికి పాల్పడడం వల్ల మార్పేశామని మెప్మా సీవో రమాదేవి తెలిపారని, అంత వరకు డబ్బులు స్వాహా అయినట్టు తమకు తెలియదని, 27 గ్రూపులకు సంబంధించి రూ.8 లక్షల వరకు స్వాహా అయినట్టు రమ, పి.భవానీ, సిహెచ్.రాజేశ్వరి, లక్ష్మిలత, ధనలక్ష్మి, జె.దుర్గ, మంగదేవి, పద్మజ్యోతి, శ్రీలక్ష్మి, సుశీల, ఎం.లక్ష్మి, కృష్ణవేణి తదితరులు తహసీల్దార్ రామారావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్, తహసీల్దార్ రామారావు వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై డివిజన్ వ్యాప్తంగా మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయి.

చెడు అలవాట్లతో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



దేవరాపల్లి హైస్కూల్‌లో సూచనలిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

దేవరాపల్లి: చెడు వ్యసనాలకు బానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని దేవరాపల్లి ఎస్‌ఐ వి.సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఇటీవల గొడవ పడ్డారు. కొందరు బాలురు కలిసి మరికొంత మందిని కర్రలతో విచక్షణా రహితంగా చిదకబాదిన విషయం సోమవారం వీడియో రూపంలో వెలుగులోకి వచ్చింది.

ఈ ఘటనపై ఎస్‌ఐ తక్షణమే స్పందించి పాఠశాలకు వెళ్లారు. విద్యార్థులను విచక్షణ రహితంగా కొట్టిన బాలురను స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి-1 సిహెచ్. ఉమ సమక్షంలో పిలిపించి మాట్లాడారు. ఈ ఘటనకు దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకొని మందలించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు చెడ్డ పేరు తెచ్చే పనులకు దూరంగా ఉండాలని విద్యార్థులకు కౌన్సెలింగ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఘాటుగా హెచ్చరించారు. పాఠశాల పనివేళల్లో విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల ఆవరణ దాటి బయటకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కుసుర్లపూడి అభివృద్ధి ఘనత వైఎస్సార్‌సీపీదే



సభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు



సభలో మాట్లాడుతున్న టీడీపీ రెండో వర్గం నాయకుడు పెద్దినాయుడు

- వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు

రోలుగుంట : కుసుర్లపూడి గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక టీడీపీ నాయకుడి చీకటి రాజకీయాలతో గ్రామ అభివృద్ధి వ్యతిరేక చర్యలు వెలుగులోకి తెచ్చేందుకు ఆదివారం రాత్రి సచివాలయం సమీపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన అందించేలా ఏర్పాటు చేసిన సచివాలయాలు, ఉప వైద్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, రోడ్లు, జల్‌జీవన్ మిషన్ తదితర పథకాల ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ఇంత అభివృద్ధి జరిగినా ఏమీ జరగలేదనడం టీడీపీ నాయకుల ఓర్వలేని తనానికి నిదర్శనం అన్నారు. సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఒక వర్గం వారు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. టీడీపీ రెండవ వర్గం నాయకులు గొల్లు రమణ, సబ్బవరపు రమణ ఈ సభలో మాట్లాడుతూ తాను టీడీపీ నాయకుడిని అని చెప్పుకోవడం గండి సింహాద్రికి తగదన్నారు. గ్రామ దేవత ఆలయ నిర్మాణం, విగ్రహం ఏర్పాటులోనూ అతని ద్వంద్వ వైఖరిని ప్రశ్నించారు. ఉప సర్పంచ్ కాశీ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిని కోరే మంచి నాయకుడికి అండగా ఉండాలని కోరారు. కాగా ఈ సభలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలతో పాటు రెండవ వర్గం టీడీపీ నాయకులు కూడా పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషం.